కౌలు భూములకు డిమాండ్

- నీటి సౌలభ్యం ఉండడంతో సాగుకు ఆసక్తి చూపుతున్న రైతులు
- ఇప్పటికే పూర్తి కావొస్తున్న ఒప్పందాలు
- పుచ్చ సాగుకు మూడు నెలలకు రూ.10 వేల పైనే..

కనగల్ : వ్యవసాయంలో ఏటేటా నష్టాలు వస్తున్నా వరి, పత్తి సాగుపై కౌలు రైతులకు ఏ మాత్రం ఆశ చావడం లేదు. నష్టాలు, ఇబ్బందులు కలుగుతున్నా వరి, పత్తి పండించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. సొంత భూములు లేకపోవడంతో కౌలు తీసుకొని సేద్యం చేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో కౌలు భూములకు ఎనలేని డిమాండ్ పెరిగింది. కనగల్ మండలంలో పుచ్చసాగుకు కేవలం మూడు నెలల కాలానికి రూ.10వేల పైచిలుకు కౌలు ధర చెల్లించి సాగుచేస్తుండడం గమనార్హం.

35 శాతం కౌలు రైతులు

కనగల్ మండల వ్యాప్తంగా 19,150 మంది రైతులు ఉన్నారు. వీరి పరిధిలో 50వేల ఎకరాల భూమి ఉంది. ఇందులో వానాకాలం వరి సాగు 30 వేల ఎకరాల్లో, యాసంగి 32 వేల ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. పత్తిని వానాకాలంలో 14 వేల ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. మిగతా భూమిలో చెరకు, బత్తాయి, నిమ్మ, ఆయిల్ పామ్, శనిగ, కూరగాయల సాగు చేపడుతున్నారు. మండలవ్యాప్తంగా భూములు లేని వారు 5శాతం ఉన్నారు. 35శాతం మంది కౌలు రైతులు ఉన్నారు.



తుర్కపల్లిలో పత్తి సాగు కోసం ప్లవ్ వేసి సిద్ధం చేసిన రైతులు

ఆయకట్టు ప్రాంతం కావడంతో..

కనగల్ మండలంలో వరి, పత్తి సాగుకు అనువైన నేలలున్నాయి. నల్లరేగడి, ఎర్రమట్టి, ఎర్ర ఇసుక కలబోసి ఉన్న భూములు అధికంగా ఉన్నాయి. వీటిలో ఏ పంట వేసినా సమృద్ధిగా పండుతుంది. ముఖ్యంగా పత్తికి నల్లరేగడి, ఎర్ర రేగడి భూములు ఎంతో అనుకూలమైనవి. వరి, బత్తాయి సాగుకు సారవంతమైన భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి.

పూర్తి కావొచ్చిన కౌలు ఒప్పందాలు

భూముల కోసం రైతులతో ఇప్పటి నుంచే ఒప్పందం చేసుకుంటున్నారు. మండలంలోని కురంపల్లి, దర్వేశిపురం, తుర్కపల్లి, ఎం గౌరారం, శాబ్దుల్లాపురం, లచ్చుగూడెం, శేరి లింగోటం, నర్సింహాపురం, తేలకంటిగూడెం, కనగల్ గ్రామాల్లో కొంత మంది రైతులు ప్రతి ఏటా కౌలుకు ఇస్తున్నారు. ఇక్కడివారితోపాటు ఆంధ్రా నుంచి రైతులు వచ్చి పత్తి పండించేందుకు భూములు కౌలు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

సాగుపై మక్కువతోనే..



సాగుపై మక్కువతో 8 ఎకరాల వ్యవసాయ భూమిని ఏడాది కాలానికి ఇదే గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి రూ.2 లక్షలకు కౌలు తీసుకున్నా. గతంలో కౌలు భూములకు ధరలు ఉండేవి కావు. ఇప్పుడు బాగా పెరిగిపోయాయి. పనులు లేక ఖాళీగా ఉండలేక భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేయాల్సి వస్తోంది.

-కారింగు యాదయ్య, కౌలు రైతు, శాబ్దుల్లాపురం

భూమి రకాన్ని బట్టి కౌలు ధర

నల్లరేగడి భూమికి ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు, ఎర్ర రేగడి భూమికి రూ.8వేల నుంచి 10వేల వరకు, ఇసుక, సవుడు, ఎర్ర రేగడి కలబోసి ఉన్న ఇతర భూములకు రూ.6వేల నుంచి 10వేల చొప్పున కౌలు చెల్లిస్తున్నారు. పత్తి సీజన్ అయిపోయే వరకు మాత్రమే లీజు కుదుర్చుకుంటున్నారు. వరి సాగుకు మాత్రం ఏడాది కాలానికి రూ.24వేల నుంచి రూ.30వేల వరకు వెచ్చించి కౌలు తీసుకుంటున్నారు. 20రోజుల నుంచి మండలంలో భూముల కౌలు ప్రక్రియ ఊపందుకుంది. ఇప్పటికే చాలా మంది రైతులు కౌలు మాట్లాడుకుని ప్లవ్‌లు వేసి భూమిని చదును చేశారు.

బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



నాంపల్లిలో బస్టాండ్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

నాంపల్లి : బీఆర్‌ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నాంపల్లి మండల కేంద్రంలోని నాగులమ్మ చెరువు సమీపంలో బస్టాండ్ నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీడీఎఫ్ నిధులతో త్వరలోనే బస్టాండ్ పూర్తి చేస్తామని అన్నారు. అనంతరం పాత తాలుకా కేంద్రమైన నాంపల్లిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలని, 100 పడకల ఆస్పత్రి మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్యేకు అఖిలపక్ష నాయకులు వినతి పత్రం అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో పర్యటించారు. స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని లారీలను వెంటనే పంపించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత, జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కుంభం విజయ, మార్కెట్ చైర్మన్ దంటు జగదీశ్, డైరెక్టర్లు కడారి శ్రీశైలం, నడింపల్లి యాదయ్య, రైతు బంధు కన్వీనర్ ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, గుమ్మడపు నర్సింహారావు, ఇట్టెం వెంకట్‌రెడ్డి, పానగంటి వెంకన్నగౌడ్, గాలెంక గురుపాదం, గజ్జల శివారెడ్డి, కృష్ణారెడ్డి, పాండు, కొండయ్య, సర్దార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మర్రిగూడ : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నుంచి కొండూరు రోడ్డు వరకు దాదాపు 200 మీటర్ల మేరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆర్అండ్‌బీ నిధులతో రూ.44.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేవిధంగా చొరవ చూపుతున్నామన్నారు. అనంతరం మండలంలోని శివన్నగూడ గ్రామానికి చెందిన మారగోని నాగమణికి మంజూరైన రూ.13వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మార్కెట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, సర్పంచ్ నల్ల యాదయ్య, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, దళితబంధు జిల్లా కమిటీ సభ్యుడు లవంగి నర్సింహ, సహకార బ్యాంకుల చైర్మన్లు పందుల యాదయ్య, బాలం నర్సింహ, కొలుకులపల్లి యాదయ్య, కోఆప్షన్ మెంబర్ యాకుబ్‌అలీ, ఆర్అండ్‌బీ ఏఈ అనిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు వినతి

మునుగోడు : రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అనుమతులు లేకుండా కిష్టాపురం గ్రామంలోని ఫార్మా కంపెనీలోకి మట్టిని తరలిస్తుండగా పట్టుబడిన వాహనాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ కుష్బూగుప్తాతో పాటు మైనింగ్ ఏజీలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బీమనపల్లి సైదులు, పోలగోని సైదులు, కై లాష్, బోయ, వెంకన్న, గోపాల్, శ్రీను ఉన్నారు.

జెండా ఆవిష్కరణ

చండూరు(గట్టుప్పల) : మేడే అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకొని గట్టుప్పల మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో సీపీఎం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, పడసబోయిన యాదగిరి, దోటి సత్తయ్య, శెట్టిగళ్ల అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రామగిరి(నల్లగొండ) : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన ఘటన సోమవారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నాయిగూడెంకు చెందిన రైతు గుండెబోయిన భిక్షమయ్య కొన్ని రోజుల క్రితం రూ.2 లక్షల వ్యయంతో రెండు పాడి గేదెలను కొనుగోలు చేశాడు. సోమవారం ఉదయం మేత కోసం కాశివారిగూడెం రోడ్డులోని పొలాల వద్దకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ఓ గేదె నీరు తాగడానికి పక్కనే ఉన్న వాగులోకి వెళ్లింది. అప్పటికే వాగులో ఎల్టీ విద్యుత్ లైన్ తెగిపడింది. వాగులోకి వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు.

రిలే దీక్షలకు రెడ్డి సంఘం మద్దతు



దీక్షల్లో కూర్చున్న రెడ్డి సంఘం నాయకులు

మునుగోడు : మండల పరిధిలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 18వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు రెడ్డి సంఘం నాయకులు మద్దతు తెలిపారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు పోగుల సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ బీమనపల్లి సైదులు, నందిపాటి వెంకన్న, బైరెడ్డి యాదిరెడ్డి, నర్సిరెడ్డి, భూపాల్ రెడ్డి, తుమ్మలూరి యాదగిరిరెడ్డి, నాగిరెడ్డి, సురేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, మాధవరెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కట్టంగూర్ : బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్ట్ ట్రయల్ రన్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తరాల బలరాములు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఊట్కూరు ఏడుకొండలు, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, సర్పంచ్ పరుశురాములు, పెద్ది బాలనర్సింహ, మేకల రమేష్, పోగుల తిరుమలేష్, ఉపేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు అంతటి శ్రీనివాస్, రెడ్డిపల్లి మనోహర్, మునుగోటి ఉత్తరయ్య, ఐతగోని సైదులు ఉన్నారు.

ఘనంగా పంచమ వార్షికోత్సవం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం ప్రాంగణంలో పంచమ వార్షికోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి, ఉత్తరపల్లి అనంతాచార్యులు అర్చక బృందం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నకిరేకల్‌కు చెందిన సుంకోజు వాసు-ఉమా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పెందోట సోమయ్య, గౌరవ సలహాదారులు అద్దంకి కృష్ణమాచారి, ఆలయ చైర్మన్ చొల్లేటి బ్రహ్మచారి, వైస్ చైర్మన్ గుంటోజు రమేష్,, ప్రధాన కార్యదర్శి చొల్లేటి శ్రీనివాసాచారి, గడగోజు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మినీ స్టేడియం అభివృద్ధికి కృషి



నకిరేకల్ : లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : నకిరేకల్ మినీ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం ఉదయం ఆయన నకిరేకల్ పట్టణంలో కాలి నడకన పలు కాలనీల్లో పర్యటించారు. మినీ స్టేడియంలో పాదచారులతో కలిసి ముచ్చటించారు. స్టేడియంలో పిల్లలకు క్రీడా సామగ్రి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇండోర్ స్టేడియంలో రేకుల పైకప్పు ఊడిపోవడంతో కొత్తవి ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, పల్లె విజయ్, దైద పరమేషం తదితరులు ఉన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు రూ.12.50 లక్షల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

కట్టంగూర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఎరసానిగూడెంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, సర్పంచ్‌లు సిలిగిరెడ్డి వినోదశేఖర్‌రెడ్డి, వడ్డె సైదిరెడ్డి, ఎంపీటీసీ ఎడ్ల పురుషోత్తంరెడ్డి, ఉప సర్పంచ్ వెంకన్న, ముప్పిడి సింహాద్రి, సత్యనారాయణ, శేఖర్, ఆంజనేయులు, గట్టయ్య పాల్గొన్నారు.

కేతేపల్లిలో సొడమ్మ జాతర ప్రారంభం



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు



జాతరలో భేరీలు మోగిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి : యాదవులకు ఆరాధ్య దైవమైన సొడమ్మ జాతర సోమవారం మండల కేంద్రం కేతేపల్లిలో వైభవంగా ప్రారంభమైంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి గ్రామంలోని యాదవులు సొడమ్మ జాతరను రెండు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామంలోని యాదవులంతా సోమవారం ఉదయం ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై సొడమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను మహిళలు నెత్తిన పెట్టుకుని డప్పు, వాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు మేకలు, గొర్రెలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఓ లింగా.. ఓ లింగా అంటూ యాదవ యువకులు భేరీలు తిప్పుతూ సంప్రదాయ రీతిలో చేసిన నృత్యాలు అలరించాయి. వేడుకల్లో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, గొర్రెలు, మేకల పెంపకందార్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్యలు పాల్గొని ఆలయంలో ప్రత్యే పూజలు చేశారు. స్థానిక ఎంపీటీసీ ఎర్రబోయిన వెంకన్నయాదవ్, సర్పంచ్ జటంగి ముత్తమ్మ, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా గంగదేవమ్మ ఉత్సవాలు

కనగల్ : మండలంలోని అమ్మగూడెం గ్రామపంచాయతీ పరిధి బొమ్మెపల్లి గ్రామంలో యాదవుల కులదైవం గంగదేవమ్మ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు గోన శంకర్‌రావు, జినుకుంట్ల రాములు, జినుకుంట్ల జయశంకర్, ఏటేళ్లి క్రాంతి, బుచ్చాల నాగరాజు, చిలకరాజు శంకరయ్య, ఆలకుంట్ల భూపాల్, ఆలకుంట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగదేవమ్మ ఆలయం ప్రారంభం

నల్లగొండ రూరల్ : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం గంగదేవమ్మ ఆలయం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మార్కెట్ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లొడంగి గోవర్ధన్, కుమ్మర సంఘం నాయకులు ఏడుకొండల వెంకటేశ్వర్లు, వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరవధిక సమ్మె



కేతేపల్లిలో సమ్మె చేస్తున్న వీఓఏలు

రామగిరి(నల్లగొండ) : వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అన్నారు. 22 రోజులుగా జరుగుతున్న వీఓఏల సమ్మెకు మద్దతుగా సీఐటీయూ మండల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం సిగ్గుచేటన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మన్నె భిక్షం, తిప్పర్తి ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ వీఓఏల పోరాటానికి మద్దతు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ భీమగాని గణేశ్, యూనియన్ సభ్యులు పోలగోని యాదమ్మ, ధనమ్మ, చనగోని వెంకన్న, రేణుక, నర్మద, పరుశరాములు, మంత్రాల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలి

కేతేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 22వ రోజుకు చేరుకుంది. సమ్మెలో సంఘం మండల అధ్యక్షురాలు తండు సుమీల, ప్రధాన కార్యదర్శి కాడంగి వీరభద్రయ్య, విజయ, వరలక్ష్మి, సత్యనారాయణ, రామసుశీల, సంధ్యారాణి, బయ్యరాణి, భాగ్యలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

పలువురి మృతికి నివాళి

చిట్యాల : పట్టణానికి చెందిన క్రెడాయ్(కాన్ఫిడ్రేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కార్యదర్శి గుమ్మి రాంరెడ్డి తల్లి దమయంతి(90) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. సోమవారం చిట్యాలలో ఆమె మృతదేహాన్ని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సందర్శించి నివాళులర్పించారు.

గురువయ్యకు..

పెద్దకాపర్తి గ్రామానికి చెందిన ఎంఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చేకూరి గణేశ్ మాదిగ తండ్రి గురవయ్య(60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఎంపీడీఓ బి.లాజర్, ఎంపీపీ కొలను సునిత వెంకటేష్‌గౌడ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతున్న పాలడుగు నాగార్జున

నల్లగొండ టౌన్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జూనియర్ పంచాయతీ కార్యర్శుల సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రొహిబిషన్ కాల పరిమితి పూర్తయినందున ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోడిరెక్క శైలజ, నరేష్, షేక్ ఆసీఫ్, వెంకటేశ్, ఝాన్సీ, ఉపేందర్, రాజశేఖర్, ప్రవీణ్, వెంకన్న, సుజిత్ పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ నల్లగొండ మండల కన్వీనర్ సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కార్యదర్శులు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శులు ఉపేందర్‌రెడ్డి, కట్ట మమత, వెంకట్, సుజిత పాల్గొన్నారు.

సీఐటీయూ మద్దతు

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ వేతనంతో ప్రజలకు సేవలందిస్తున్న కార్యదర్శుల న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలన్నారు. లేకుంటే ఈ నెల 11న ఎంపీడీఓ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోతపాక వినోద్‌కుమార్, సత్యనారాయణ, అంజయ్య, నరసింహ, ఎండీ జహీర్, ఏర్పుల సైదులు, ఎం.రమేష్, ప్రభాకర్, రామలింగయ్య, సైదులు, నాగరాజు, నాగయ్య, అండాలు, పెద్దమ్మ, పుల్లయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

సమ్మెకు డీవైఎఫ్ఐ మద్దతు

చిట్యాల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చిట్యాల ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా చేపట్టిన సమ్మె పదకొండో రోజుకు చేరుకుంది. సోమవారం సమ్మె శిబిరాన్ని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా విధుల్లో చేరాలని పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం ఒత్తిడి తేవడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ టీపీ మద్దతు

శాలిగౌరారం : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శాలిగౌరారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరు సోమన్న మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ గ్రంథాన్ని పంపిణీ చేయాలి

కట్టంగూర్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ప్రచార కమిటీ మండల ఇన్‌చార్జ్ చిలుముల గిరి మాట్లాడుతూ రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడమే తమ పార్టీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నాగరాజు, సైదులు, సాయి, వంశీ, శ్రీను, గిరి ఉన్నారు.

చండూరు : భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని కోరుతూ తహసీల్దారు అర్చనారెడ్డికి సోమవారం డీఎస్పీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం, సుమన్, రాజేష్, మహేష్, సైదులు యాదవ్, శంకర్, వెంకటేష్, మహేష్, శంకర్, రాజ్ కుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : దేశంలోని ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ గ్రంథాన్ని ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ డీఎస్పీ(ధర్మ సమాజ్ పార్టీ) నాయకులు సోమవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ జూటూరు తారక రామన్‌కు వినతిపత్రం అందజేశారు. నక్క గిరి, లవంగి వినోద్, శ్రీను, గణేష్, శేఖర్, సుధాకర్, ప్రశాంత్, రాజు, వినయ్, నరేష్, భిక్షం, లక్ష్మణ్, సాయి, దేవేందర్, జగన్, రాజు పాల్గొన్నారు.



చండూరు : తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

నల్లగొండ క్రైం : బుల్లెట్ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని టూటౌన్ ఎస్ఐ సైదులు అన్నారు. నల్లగొండ పట్టణంలో పలు వాహనాలను స్వాధీనం చేసుకుని కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

నల్లగొండ క్రైం : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నల్లగొండ టూటౌన్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలువురు రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీసు రికార్డులో ఉన్న నేరస్తులందరిపై నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బెదిరింపులు, సెటిల్మెంట్లు చేస్తే సహించబోమన్నారు.

'బీఎస్పీకి మాదిగలు దూరంగా ఉండాలి'

మర్రిగూడ : ఎస్సీ వర్గీకరణ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్న బీఎస్పీకి మాదిగలు దూరంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ ఇరిగి శ్రీశైలం అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. మాదిగ జాతి ఆకాంక్షలను మాయావతికి వినిపించడంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విఫలమయ్యారని అన్నారు. బీఎస్పీని నమ్మి మాదిగలు మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గ్యార శ్రీనివాస్, జిల్లా తిరుమలేష్, ముదిగొండ రమేష్, వడ్డె రంజిత్, దుబ్బ సంజీవ, హరికృష్ణ, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలి

చిట్యాల : పట్టణంలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో సోమవారం జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో చిట్యాలలో జూనియర్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ కాలేజీ ఏర్పాటు కార్యరూపం దాల్చలేదన్నారు. చిట్యాల పట్టణంలో జూనియర్ కాలేజీతో పాటు గురుకుల స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిట్ట సురేష్, కూరాకుల బాలు, జిట్ట గణేష్, బొల్లూరి శ్యామ్, బరాల చరణ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న నారి అయిలయ్య

చిట్యాల : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య డిమాండ్ చేశారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సోమవారం ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కూలీలకు సరైన వేతనాలు రావడం లేదని అన్నారు. అనంతరం ఉరుమడ్ల, తాళ్ళవెల్లెంల గ్రామాల ఉపాధి హామీ కూలీల గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, ప్రజా సంఘాల నాయకులు ఐతరాజు నర్సింహ, గోపగోని కవిత, బత్తుల పద్మ, జనగాం శారద, కొమ్మగాని సరిత, నల్లబెల్లి రేణుక, యాదయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం : మండలంలోని ఎన్జీ కొత్తపల్లిలో ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన సూరారం రాములు కుటుంబాన్ని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరు సోమన్న సోమవారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట తడకమల్ల ప్రశాంత్, వెలుగు అంజయ చంద్రశేఖర్, సందీప్, ప్రేమ్ తదితరులు ఉన్నారు.

మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



మునుగోడు : రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి యాదయ్య



నకిరేకల్ : ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మందుల సామేల్

శాలిగౌరారం : రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తిరుమల రాయినిగూడెం, శాలిగౌరారం మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. లారీల కొరత ఉందని రైతులు చెప్పడంతో వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఆయన వెంట నాయకులు చామల సుదర్శన్‌రెడ్డి, పడాల రమేష్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

మునుగోడు : మండల పరిధిలోని రామకృష్ణాపురం, కచలాపురం, పలివెల, సింగారం, కొంపల్లి, గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నియోజకవర్గ ప్రత్యేకాధికారి యాదయ్య సోమవారం పరిశీలించారు. ఎగుమతి, దిగుమతులపై రైతులకు సూచనలు చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.

వర్షానికి తడిసిన ధాన్యం

నాంపల్లి : మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉన్న రైతుల ధాన్యం తడిసిపోయింది. మండలంలో గత సంవత్సరం 3 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం ఒక కేంద్రాన్ని మాత్రమే ప్రారంభించారు. వరి ధాన్యం ఎక్కువగా రావడం, సరిపడా లారీలు రాకపోవడంతో కాంటా వేసిన ధాన్యం బస్తాలు తడిసి ముద్దయిపోతున్నాయి. కాంటా వేయని ధాన్యం కుప్పలు వర్షం నీటిలో మునిగి తేలుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మ్యాచర్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నాంపల్లి : నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు